# వేర్ ఏంజెల్స్ ఫియర్ టు ట్రెడ్

రివరీ: అదొక అవస్థలాంటిది. ఏదో ఆలోచిస్తున్నట్లుంటాము. నిద్ర కాదు. జాగ్రదవస్థా కాదు, మధ్య రకం. ఏవేవో దృశ్యాలు, ఏవేవో రూపాలు మరేవోనీడలు—కళ్ళ వెనకాలగానూ, మెదడు మధ్యనుంచీ కదుల్తుంటాయి నిదానంగా, బద్ధకంగా. మూతవేసి పెట్టిన బిందెలో చప్పుడు చేస్తే వినిపించినట్లుగా ఏవేవో సంభాషణలు అస్పష్టంగా ముద్ద ముద్దగా వినిపిస్తుంటాయి ఎక్కణ్ణించో. అట్లాంటి అవస్థలో ఉన్నా నారోజు మధ్యాహ్నం — ఆఫీసులో.

"అయ్యో అయ్యో, నన్నొదిలిపెట్టు నీ కాళ్ళు మొక్కుతాను."

హటాత్తుగా వినిపించిన కేకలకు ఉలికి పాటుతో ఈ లోకంలోకి జారిపడ్డాను. మెత్తటి పదార్థం మీద ఇసక రుద్దినట్లుగా ఉందా గొంతు. పిల్లవాడిగొంతు కావచ్చు, లేక ఆడదానిగొంతూ కావచ్చు, దగ్గరనుంచే, పక్కనే ఉన్న కాకా హోటల్లోంచిలా.

చప్పున మెట్లుదిగి రోడ్డుమీదకు వచ్చాను. అవును కాకా హోటల్లోంచే. ముందు - రోడ్డు మీద — చుట్టూ జనం మూగి ఉన్నారు. మధ్యలో—ఆ మధ్యలో...

ఒక యువతి—

పాతికేళ్ళకు మించి ఉండవు. పుష్టి కరంగా వొళ్ళు, జబ్బలు, రొమ్ములు, పిరుదులు, అంతా అంతటా పురుషుల నిగ్రహాన్ని కూలగొట్టగలిగే శక్తిగలామె...

మరో పురుషుడు—

బట్టతల, గొట్టాం ముక్కు, జీబురుకళ్ళు, తెల్లటి బట్టలూ గలవాడు—

వాడామెను—

రెండుచేతులతో చుట్టి,

ఇవతలకులాగుతున్నాడు బలాన, బార్బారియస్‌గా. బ్రూట్ లా, బందిపోటులా, పక్కనే ఉన్న రిక్షా వద్దకు.

ఆమె చేతిలో ఓ మూట ఉంది. ఆ మూట నామె భద్రంగా పట్టుకుని ఉంది. ఆమె ఏడుస్తోంది. అతనితో పెనగులాడుతోంది. అదే సమయంలో అతని కాళ్ళు పట్టుకుంటోంది. అరుస్తోంది.

"బాబూ, నీకాళ్ళట్టుకుంటాను నన్నొదిలిపెట్టు నన్ను పోలీసుల కప్పజెప్పకు..."

అంటూ...అంటో...అంటో...

అతనేమో లాగుతున్నాడామెను. చీరలోని పమిట భాగం అతని చేతిలో ఉంది.

బిగుతు పొట్ట, ఛాలెంజీ స్తనాలు-ఎగిసి పడుతో బుసలు కొడుతో...

చుట్టూ జనం కళ్ళలో ఆకలి, ఆశ, దాహం...

నాచేతిలో మెషిన్‌గన్ లేదు.


"ఏం జరిగింది?" అడిగాను

జవాబు లేదు. వాళ్ళంతా తురకలు, తెలుగు తురకలూ, తురక తురకలూ,

"క్యా హువా భాయ్?" మధ్యలో హీరోనే అడిగాను, అతని భాషలోనే.

"చోరీ కరా సాబ్!!"

కంఠంనేని రాధాకృష్ణమూర్తి



అతను చాలా బిజీగా వున్నాడు. అంత మాత్రమే చెప్పగల్గాడు. చుట్టూ వాళ్ళుకూడా అంతే బిజీగా ఉన్నారు. తమ తమ కళ్ళతోనూ, మనస్సుల్లో లొట్టల్తోనూ

మళ్ళీ అతను-

ఆమె చేతిలో మూటను లాక్కోవటానికి ప్రయత్నించాడు. ఆమె దాన్ని తన గుండెలకు అదుముకుంది. వీలైతే గుండెల్ని చీల్చి ఆ మూటను లోపల దాచుకునేట్లుగా కూడా ఉందామె.

ఆమె మొహాన కుంకుమ బొట్టుంది. గుండ్రంగా, గుండ్రంగా పెద్దగా, చామనచాయ.

అరె!

అతని చేతిలోనికి మూట ఊడి వచ్చింది. దానిపై బట్ట ముడి ఊడివచ్చింది. లోపలన్నీ బట్టలు, చీరలూ, టెరీకాటన్ తానులూ...

అతని నోటినిండా బూతులు,

అసలేమి జరిగింది? అర్థం కాలేదు నాకు సరిగ్గా

ఆమె చటుక్కున పారిపోవటానికి ప్రయత్నించింది. అతను జబ్బ పుచ్చుకున్నాడు.

"బాబూ నన్నొదులు చచ్చి నీ కడుపున పుడతాను నన్నప్ప జెప్పకు..."

అంత భయమా పోలీసులంటే?!

"చలో పోలీస్ ఠానాకో మాకే..."

బూతులు, బూతులు, బూతులు.

అరే!!

అందరి కళ్ళల్లోనూ వెలిగిన ఫ్లాషెస్.

ఏమయింది? ఏమయింది?

చీర ఊడి అతని చేతిలోకి వచ్చింది.

లో లంగా, జాకెట్ మాత్రమే ఆమెవంటి మీద.

చుట్టూవున్న వాళ్ళలో ఒక స్త్రీ కూడా ఉంది, పొట్టిగా జిడ్డు మొహంతో. రాత్రి కాగానే మా ఆఫీసు వెనక కలాపాలు సాగించే బజారు స్త్రీ. ఆమె కన్నా జాలి రావటంలేదా? లేదు లేదు. చూడండి ఆమె కూడా నవ్వుతోంది.

నాలో కోపం తన్ను కొస్తోంది. కలగ జేసుకుందా మనుకున్నాను. కాని, కాని... మాతృభాషనే మర్చి పోతాను నేను. ఇంక వాడి భాషలో ఏమి మాట్లాడ గలుగుతాను?!

ఆమె అలిసి పోయినట్లుంది గభాల్న బోర్లా క్రింద పడిపోయింది రోడ్డు పక్క దుమ్ములో మొహం దాచుకుంటూ, చలనం వదిలేసి-స్పృహ కోల్పోయిన దానిలా...

ఏమయింది? నిజంగా స్పృహపోయిందా?

"ఐసానై, చెప్పల్ సే మార్తూం, చెప్పల్ లావోజీ"...

అరుస్తున్నాడు వాడు.

అంతా వింత చూస్తున్నారు. బోర్లా పండుకున్న ఆమె పిరుదుల వైపూ, ఆపై వీపు విశాలత్వం వేపూ, ఆ క్రింద మోకాళ్ళ వెనక నగ్నత్వం వేపూ...

ఆ పొట్టి వేశ్య కూడా సాటి స్త్రీ అవమానంలో తమాషాను మాత్రమే ఫీలవుతోంది. సెభాష్ ఇది హిందూ దేశం కదూ!?!

గన్ను, గన్ను, మెషీన్ గన్నయ్యా బాబూ, స్మాష్ చేసేస్తాను ఈ దేశాన్ని!!

ఏమయినా ఇది కౌరవ రాజ్యం! భీష్మ ద్రోణాదుల్లాంటి వాడినేనా నేనూనూ?!!

ఆ సమయాన ఒక అద్భుతం జరిగింది.

సినిమాల్లోలా ఎవరో హీరో వచ్చి ఆమె నాదుకో లేదు సుమండీ! ఆమెకు ఆమే-బంధించబడి ఉన్న గదిలో బాధపడుతున్న పిల్లిలా —

ఛెంగున లేని,

పైకి పోయిన జాకెట్టును స్తనాల దిగువకు లాక్కుని, ఇరుకు లంగాను తొడల వరకూ ఎత్తి పట్టుకుని, చటుక్కున-వింటి నుంచి వదలబడ్డ బాణంలా-చివ్వున దూసుకు పోయింది ముందుకు. జనం మధ్యనుంచి, రోడ్డు దాటుకుని, రైల్వే క్వార్టర్ల పక్క, నుంచి, అటువేపుకు- అవలివైపుకు.

ఆమె అవయవ విన్యాసానికి జనమంతా హోరున నవ్వుతున్నారు. వెర్రి ఆనందాన్ననుభవిస్తున్నారు, పొట్టి వేశ్యతో సహా.

చట్టున వాన కురిసి వెలిసినట్లయింది.

భారంగా ఆఫీసు వేపుకు అడుగులు వేసాను. కూర్చీలో కూలబడ్డాను. తలంతా దిమ్ముగా ఉంది ఏం జరిగింది? ఒక అబల... ఈ పవిత్ర భారతదేశంలో...సరే, మగవాళ్ళ సంగతి తీసేద్దాము. మరి ఆ పొట్టి వేశ్య సంగతి? సాటి స్త్రీపట్ల చూపించాల్సిన కనీస సానుభూతి నన్నా చూపించకుండా - ఎంత ఆనందాన్ని జుర్రుకుంది, అవతలి స్త్రీ అవమానంలోంచి?! ఎట్లా సాధ్యమిది? మనుషుల మనస్సుల్లో మృదుత్వాలు అంతగా ఎండిపోతే ఇంక వాళ్ళలో ఏమి విలువలు మిగిలి ఉన్నట్లు?? లేక వృత్తి వైరం పని చేసిందా ఆమె మనస్సులో? తనేమో మానాన్ని కోల్పోయి డబ్బులు సంపాదిస్తోంది, పొట్ట కూటికోసం. ఆమేమో హస్త లాఘవాన్ని ప్రదర్శించి, పట్టుబడితే ఒక్క గౌరవాన్ని మాత్రమే పోగొట్టుకుంటోంది. మానాన్ని భద్రంగానే దాచుకుంటూ; ఈ బాపతు ఈర్ష్యా ద్వేషాలు పనిచేసాయా పొట్టి వేశ్య మనస్సులో?? పోనీ ఆమె స్థానంలో మరే సంసార స్త్రీయో ఉన్నట్లయితే ఆమె ఎలా ప్రవర్తించి ఉండేది? లేదు లేదు అంతా ఇంతే. వాళ్ళకి వీళ్ళకి ఎక్కడా తేడానే లేదు, ఏ విషయంలోనూ, ఈ దేశపు ఆడవాళ్ళ రొమ్ముల పైభాగాలు ఎంత మృదుత్వాన్ని కలిగి ఉంటాయో, ఆ వెనక భాగాలు అంతటి పాషాణత్వాల్ని కలిగి ఉంటాయి. హెల్, హెల్...తల విదిలించాను.

ఆ సమయాన గంగారాముడు గదిలోకి ప్రవేశించాడు, అతని మొహం వికసించి ఉంది. మనిషి ఆనందంగా కనిపిస్తున్నాడు.

"ఏమయిందట?" అడిగాను. ఇట్లాంటి వాటికి సామాన్యంగా ఉపోద్ఘాతాలు అవసర్లేదు.

"ఆ యమ్మాయి బట్టల షాపులో దొంగతనం చేసిందంట. ఎన్ని బట్టలొన్నార్! రెండు వేలుపైనే ఉంటుంది వాటి ఖరీదు".

"వాడెవడు మరి?"

"వాడా షాపులో మునీమ్ అంట," (గుమస్తాలాంటి వాడు)

అసలు జరిగింది ఏమిటంటే-ఆమె మరో ఇద్దరి సహకారంతో ఆ షాపులో బట్టలు దొంగిలించింది. ఆ సమయాన మునీమ్ ఒక్కడే ఉన్నాడంట. షాపులో ఆ దొంగతనం ఏ రూపంలో జరిగిందో నా కర్థం కాలేదు. గంగారాముడూ క్లియర్‌గా చెప్పలేకపోయాడు. ఆమె తన అవయవ సౌష్టవాన్ని ప్రదర్శించి ఎట్లాగో ఆ మునీమ్ గాడిని ప్రలోభపరిచి ఉండొచ్చు. ఇది ఉత్త నా ఊహ మాత్రమే మొత్తానికి దొంగతనమయితే చేసి ఆమె సురక్షితంగా బయటకు జారుకుంది. తర్వాత షాపు సేట్ వచ్చాక దొంగతనం బయటపడింది. సేటుకి మునీమ్ నిజాయితీ మీద అనుమానమన్నా కలిగి ఉండాలి, లేక మునీమ్ అసమర్థత మీద కోపమయినా కలిగి ఉండాలి, మొత్తానికి అతను మునీమ్‌ని పనిలోంచి తీసివేసాడు. వెంటనే తిరిగిపోయిన బట్టల్ని తీసుకువచ్చేవరకూ పనిలోకి రావద్దన్నాడు. మునీమ్‌గాడు ఇక టౌన్ చుట్టూ గిరికీలు కొట్టటం ప్రారంభించాడు. ఉదయాన్నించీ తిండితిప్పలు కూడా మర్చిపోయి ఆఖరికి అదృష్టవశాత్తూ ఆమెను, ఆ ఆడదొంగను ఈ కాకా హోటల్లో భోజనం చేస్తుండగా పట్టుకోగల్గాడు. ఆమెతోపాటున్న మిగాతా ఇద్దరూ ఇకణ్ణిచూస్తూనే జారుకున్నారట. ఆమెమాత్రం బట్టలతో సహా దొరికిపోయింది... కాని నాకొకటి అంతు పట్టలేదు. ఉదయాన్నుంచీ ఆమె ఊరు దాటిపోకుండా ఇంకా ఇక్కడే ఎందుకు తిరుగుతోందో అర్థం కాలేదు. ఏ కారణమైనా కావచ్చు గాని జరిగింది ఇదే...

స్త్రీలు పురుషుల నీడల్లో బతికే మనబోటి సమాజంలో ఒక స్త్రీ దొంగతనం చేయాల్సిన అవసరం కలిగిందంటే అది శోచనీయమైన విషయం. ఆమెకు పురుష సంబంధమైన ఆధారమేదో లేకుండానైనా ఉండాలి. లేక ఉండీ లేనట్లుగానయినా అయి ఉండాలి. మొత్తానికి ఆమె తన పొట్ట కూటికోసం దొంగతనం చేసింది. అంతవరకూ బాగానే ఉంది. ఒక కోణంనుంచి చూస్తే అది కొంత సమర్థనీయమైనది కూడా నేమో కాని ఆమె తన పొట్ట కూటికోసం మరోడి పొట్టను కొట్టిందే! అక్కడ వచ్చింది చిక్కు!! ఆ మునీమ్ గాడికి ఇంటివద్ద భార్యాపిల్లలు ఉండి ఉంటారు వేరే ఏ ఆధారమూ ఉండీ ఉండక పోవచ్చు అట్లాంటి స్థితిలో అతని ఉద్యోగం ఊడిందంటే అతను కూడా మరో నేర కూపంలోకి నెట్టబడుతున్నాడన్న మాట. పనిచేస్తాననే వాడికి పనిచూపించలేని మన సమాజంలో పని దొరకని మాన



'ఇంప్రింట్' సౌజన్యంతో

వుడు ఇంకేమి చేస్తాడు?! ఆకలితో మాడి అయితే చావలేడు కదా! తన ఆఖరి ప్రయత్నాలుగా ఏ నేరాల్లోకో జారబడి అన్నం బట్టకట్టటానికి ప్రయత్నిస్తాడు. దొంగతనం చేసో, దొంగ రవాణా చేసో, లేక వ్యభిచారాన్ని వృద్ధి చేసో, ఎట్లాగైనా గానీ...స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్, అంతే! పూటపూటకీ పుష్టిగా భోజనాలు చేసి వాలు కుర్చీల్లోకి జారి ఈజీగా పగటి కలల్లోకి వెళ్ళిపోయే మన కోటి వాళ్ళకు ఆ బాపతు సిట్యుయేషన్స్ అర్థం కావు కూడా...

"మొత్తానికి మునీమ్‌గాడి రొట్టె నేతిలో పడింది సార్."

గంగారాం స్వరం వినిపించటంతో అతని వేపు ప్రశ్నార్థకంగా చూసాను.

"ఆ మూటలో చాలా బట్టలున్నాయి సార్," అతనన్నాడు! "ఈ మునీమ్ వాళ్ళ షాపులో దొంగలించినవే కాకుండా వేరే షాపుల్లో దొంగిలించినవి కూడా వున్నాయి. అవన్నీ మునీమ్ సొంతమవుతాయి. పైగా వాళ్ళ సేటు మళ్ళీ పనిలోకి కూడా తీసుకోవచ్చు ఇతణ్ణి..."

"అదేమిటి, ఆ యువతిని పోలీసులకప్పజెప్పటానికి అంత తాపత్రయపడ్డ మునీమ్ ఈ బట్టల విషయంలో మట్టుకు పోలీసులకు రిపోర్టు చేయడా?". అదే అన్నాను గంగారామ్‌తో.

"భలేవారు సార్ మీరు!" గంగారామ్ అన్నాడు, "ఇ యమ్మాయిని అంత గొడవ పెట్టాడు కాని నిజానికి ఆమె పారిపోక పోయినా పోలీసుల కప్పజెప్పుతాడనుకున్నారా? అట్లాగే ఈ బట్టలప్పజెప్పటం కూడా!! పోలీసులంటే మాటలా సార్, రోజుల తరబడీ వాళ్ళ చుట్టూ తిరగాలి, వాళ్ళ సతాయింపులకి బేజారెత్తకుండా తట్టుకోవాలి. వేరే షాపుల బట్టల సంగతి తీసేసినా కనీసం తమ షాపు బట్టలయినా తిరిగి మునీమ్ చేతికి వస్తాయన్న నమ్మకముండదు. ఇదుగోండి సార్, ఆఖరికి మన సొంత ఇంట్లో దొంగతనం జరిగినా గాని పోలీసులకు రిపోర్టు చేయటం కంటే, చేసి ఫలితం లేకుండా వాళ్ళ చుట్టూ కాళ్ళరిగేట్లు తిరగటం కంటే మనకు మనం నోరు మూసుకు కూర్చోవటం ఉత్తమం..."

ఇంకేమేమిటో అంటున్నాడు గంగారాముడు. ఇందాక ఆమె తనను పోలీసుల కప్పజెప్ప వద్దంటూ భయంతో ఆక్రోశించటం గుర్తుకొచ్చింది నాకు. మునీమ్‌కి కూడా వాళ్ళని కలవటం ఇష్టంలేదు. విచిత్రమైన సంగతి! దొంగకి దొంగలించబడ్డ వాడికీ ఇద్దరికీ రక్షకభటుడంటే భయమూ, ఎలర్జీనే. ఇది మరే దేశంలోనూ జరగదేమొ, ఒక్క ఈ పవిత్రావనిలో తప్ప. అయితే మరి వీళ్ళెందుకున్నట్లు, అంత పెద్దఖర్చుతో? నగరాలకి అలంకారాల కోసమా?? కాదు కాదు.

"వాళ్ళు మనకోసం కాదు సార్, డబ్బున్నవాళ్ళ కోసమూ, పరపతి ఉన్నవాళ్ళ కోసమూను..."

ఇవి నా మాటలు కావు. గంగారాముడు ఉవాచిస్తున్నాడు. అతను మా ఆఫీసులో వాచ్‌మన్. ఈ దేశంలోని ఒక సామాన్యుడు. అతని అభిప్రాయాలివి. అభిప్రాయాలు ఎప్పుడూ అనుభవాల్లోంచే పుట్టుకు వస్తాయి 'కాంట్' చెప్పిన 'Knowledge a Priori' లాగ.

సో...

'వేర్ ది ఏంజెల్స్ ఫియర్ టు ట్రెడ్' అంటాడు. షెల్లీనో కీట్సోగాని ఒకచోట.

ఏంజెల్స్ అంటే ఎవరో కాదు, సజ్జనులూ బలహీనులూనూ...బలహీనులు మంచిగానే తప్ప మరోరకంగా ఉండలేరు, తమ కెటూ చెడు చేయటం చాతకాదు కాబట్టి...

అంటే—

'ఎక్కడ సజ్జనులు నడవటానికి భయపడతారో...'

అక్కడ భక్షకభటులూ, ఘరానా మనుషులూ ఉండి ఉంటారన్నట్లా??!

కావచ్చు............ *